


స్విచ్ ఆఫ్‌చేసి నెమ్మదిగా రగ్గుని కప్పుకుని పడుకున్నాను. వీధిగదిలో పడకకుర్చీమీద కూచుని శర్మ పేపరు చదువుతున్నాడు. కొంచెంగా కళ్లు మూతపడ్డాయి.

ఎవరో వొచ్చి మంచంమీద కూచుని, మెల్లగా నా చెయ్యిల్ని తడిమి పట్టుకున్నారు. తర్వాత వక్షోజాలు మెత్తగా నా వక్షాన్ని తాకినట్టయింది. నిశ్వాసం మెల్లగా విడుస్తున్నట్టుకూడా వినపడింది. వెంటనే ముసుగు తీశాను; లేవబోయాను.

పెద్ద జడొకటో నామీద పడింది. జుట్టులోంచి కమ్మని వాసనలు వెలువడుతున్నాయి. ఎవరో యౌవ్వనంలోని స్త్రీలా వుంది. ఇరవై ఏళ్లుంటాయి.

"ఎవరు?" అన్నాను ఏం అర్థంకాక. వీధిగదిలో శర్మ చదువుతూనే వున్నాడు.

"నేనా... వేణ్ని!"

తిన్నగా కూచుని అంది కృష్ణవేణి— శర్మ భార్య. అతిథిగా వెళ్ళినందువల్ల ఆ వేళ తప్పితే ఆమెని ఇదివర కెప్పుడూ చూళ్లేదు.

'ఏమిటీ దారుణం?'

అదే పైకి అన్నాను.

"ఏదో రుణం. ఆ రుణం తీర్పించుకుందామనే వొచ్చాను"

సన్నని వేలితో బుగ్గమీద మీట బోయింది. నేను వెనక్కి తగ్గాను.

"పాలు కొరవులేవోయ్" అంది వయ్యారంగా కూనిరాగం తీస్తూ. నా వైపు కొంచెం జరిగింది. నేను పూర్తిగా రగ్గుతీసి ఓ మూలకి ఇరికాను.

మా మాటలు విని శర్మ ఏమన్నా కదులుతాడేమో అంటే అదీ లేదు. అతను గమనించనట్టు ఊరుకున్నాడు.

"మొగవాళ్ళలో కూడా పతివ్రతలుంటారన్నమాట! తాకితే నా బంగారం అంటుకుంటుందా?"

నాకు వొళ్లు మండింది. ఏమిటీ సంసార వ్యభిచారం! మానవ నాగరికతలో ఒక నీతి, నియమం ఉండొద్దా?

"నీ వుద్దేశం నాకు తెలిసింది కాని, పొరపడుతున్నావు. నేను వ్యభిచారాన్ని ప్రోత్సహించే మూర్ఖుణ్ని కాను. ఆడవాళ్ళ చేతుల్లో ఆటవొస్తువుని కాదు. అడుగో నీ భర్త అక్కడికి వెళ్లు" అన్నాను.

"నా ప్రియసారంగధరా..." అని గెడ్డం పట్టుకోబోయింది. వీధిగదిలోని దీపంనించి వొచ్చే గుడ్డి వెలుతురులో ఏదో కొదు పిశాచంలా కనపడింది.

"షటప్—"అని చేతినీ, మనిషినీ తోసి పుచ్చాను.

వొగరుస్తూ లేచి నించుంది.

"ఇందాకటి నుంచి ఏదో ఎప్పుడన్నా నాటకంలో సారంగధర వేషం వేశారనుకున్నాను. ఛీ, మూర్ఖుడా! కోరివొచ్చిన ఆడదాన్ని అనుభవించడం చేతకాని అమాయికుడా! నీ యింతోటి అందాన్ని మోహించి వొచ్చాననుకున్నావా! ఛో" అంటూ అక్కడినించి వెళ్లిపోయింది.

శర్మయింకా వీధిగదిలో పేపరు చదువుతూనే వున్నాడు. నా బెడ్డింగ్ సర్దుకుని నేను కదిలాను అతను అడ్డలేదు.



అంతా కళ్ళకి కట్టినట్టయింది. ఆ వేళ ఆ స్థితిలో చూసిన కృష్ణవేణ్ని ఈ వేళ ఇక్కడ ఈ స్థితిలో చూశాను.

ఏదో వింతకే సొచ్చింది రమ్మనమని డాక్టరు మూర్తిగారు కబురుచేస్తే వొచ్చాను.

కృష్ణవేణి జబ్బుల్తో ముఖమంతా నల్లబడి, జీర్ణావస్థలో పడుకునివుంది. నన్ను చూసి చేతులు జోడించి, కూచోమని సంజ్ఞ చేసింది.

పక్కని స్టూలుమీద కూర్చున్నాను. మనిషి వాలిపోయి అస్థిపంజరమైంది. చేతులూ, వేళ్లూ, ముఖం, ఎముకలు తప్ప వేరేం కనపడ్డం లేదు.

డాక్టరుమూర్తిగారు అన్నారు. "ఆవిడే మిమ్మల్ని పిలిపించమని అడిగింది. మీతో ఏదో మాట్లాడాలట."

నాకు ఆశ్చర్యమేసింది. ఆరేళ్ల క్రితం జరిగిన ఆ సంఘటన తప్ప ఆమెకూ, నాకూ వేరు పరిచయం లేదు. ఏం చెబుతుంది నాతో?

ఆలోచనలో వున్న నామీద ఎముకల్లాంటి వేళ్ళు పడి స్పృహ కలిగించాయి.

"నన్ను క్షమించవూ" అంది. కళ్లల్లో నీళ్లు నిండాయి.

నెమ్మదిగా వేళ్లని నిమిరాను.

"శర్మ ఎక్కడ?" అన్నాను.

"ఏమీ తెలియదు. రెండేళ్ల క్రితం నన్ను వొంటరిగా విడిచి ఎక్కడికో పోయారు. మళ్ళీ జాడ తెలీలేదు" నీరసమైన గొంతుకతో అంది.

"అసలు ఎందుకొచ్చిందీ దురవస్థ?" జాలితో అన్నాను.

నర్సు ఏదో మందు తాగించింది ఆమె చేత.

కృష్ణవేణి గొంతుకు ఓ పొడిదగ్గు దగ్గి సర్దుకుంది. నుదిటిమీద వేలితో రాసి చూపించింది. కళ్లు లోతుగా పోయాయి. రెప్పలు నల్లబడ్డాయి.

"అట్టే శ్రమ నియ్యకండి ఆవిడకి". అన్నారు డాక్టరు మూర్తి.

"అబ్బే! శ్రమ లేదు చెబుతా నుండండి" అంది కృష్ణవేణి కొంచెం వూపిరి తీసుకుంటూ. తలగడ చేతికింద పెట్టుకుని, దాని మీద ఆనుకుని మా ప్రక్కకి తిరిగింది.

నేను ముఖ పరిశీలన చెయ్యసాగానూ ఆవిడ చెప్పింది.

"అసలు ఆడవాళ్ల ప్రకృతే వేరు—మానసికంగా, శారీరకంగా. అది తెల్సుకుని ఆడవాళ్లుగాని, మగవాళ్లుగాని సరిగా ప్రవర్తించనప్పుడు ఇట్లాగే జరుగుతుంది. రైలు ఇంజను పట్టాలను తప్పితే సరి చెయ్యొచ్చును. కాని, కాలుజారిన ఆడది మళ్లీ ఆ అడుగు తియ్యలేదు. ఆ జీవితం ఇంక అంతే! అదీ నా అనుభవం.

నా కథ విన్నాక నన్నూ నిందించరు; మీరు నా భర్తనీ నిందించకు. మనం నివ

సించే దుర్భర సమాజ పరిస్థితుల్నీ, పరిస్థితుల్ని మార్చుకోడం తెలియని మన చాతకానితనాన్ని నిందించుకోవాలంతే!

"మీకు తెల్సు ఈవేళ ప్రపంచం ఎంత దుర్భిక్షంతో మండిపోతోందో. సామాన్య మానవుడు ఏదో గతిలేక బతుకుతున్నాడు. కాని జీవచ్ఛవంలా, జీవించడానికి కాదు; జీవితాన్ని ఆనందించడానికీ కాదు; చావలేక—నిజం అంతే!

"అదే మా కుటుంబాన్ని కూర్చింది. అసలే ఉద్యోగాలకీ, అభివృద్ధికీ ఎవరో దేవుళ్లుండాలి. అలాంటిది రెండో యుద్ధం లోకానికి వేరే రోగం తెచ్చిపెట్టింది. అది అధికార మదాంధత—దానికి తోడు కామాంధత!

"అప్పుడు మిలిటరీలో పని చేసేవారు ఆయన. మేం ఎక్కడో బారక్సులో ఓ మూల సామాన్య కుటుంబంగా వుండేవాళ్లం. ఎన్నేళ్లు పనిచేసినా ఈయన ఉద్యోగంలో ఎదుగు కనపడలేదు. తక్కిన వాళ్లు పెద్దపెద్ద జీతాలు పొంది అభివృద్ధి చెందసాగారు. నాకు ఏదీ అర్థంకాలేదు. ఎందుకని? ఆయనకు తెలివితేటలు లేకా? ఆయన్ని ఓ సారి అడిగాను. తల భూమిలోకు దించుకుపోయినట్టు అయి, ఆయన అన్నారు 'వాళ్లు వాళ్ల భార్యల్ని......' నాకు అర్థమైంది. 'బాబోయ్!' అరిచాను. కళ్లు తిరిగాయి.

"కొన్ని రోజులు దొర్లిపోయాయి. ఆ చెడ్డమాట మర్చిపోయి సూటిగా మళ్ళీ బతకసాగాను. ఒక రోజు సాయంత్రం ఆయన కారులో వొచ్చారు. 'త్వరగా బట్టలు వేసుకో' అన్నారు. 'ఏం' అన్నాను. 'సినిమాకి పోదాం'. 'ఏం' కారుకూడా దొరికిందేం ఈవేళ?, 'అంతా వుందలే' అని నన్ను తొందరచేశారు. నేను నిజమనుకొని నమ్మాను; బయలుదేరాను.

"కారు ఓ ఇంటి ముందర ఆగింది. ఆయన దిగకుండా 'ఆ జవానుతో వెళ్లు' అన్నారు. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. 'నే వెళ్లను' అన్నాను. 'నువ్వుకూడా నన్ను చంపు. మనం జీవితంలో ఇంకెప్పుడూ సుఖించొద్దూ' ఆయన ప్రార్థించి, కళ్లనీళ్లు తెచ్చుకున్నారు. ఏం చెయ్యను?....

"ఆ విదేశీయుడి చేతుల్లో మసైన నా శరీరాన్ని ఆ కారే మళ్లీ మా యింటికి చేర్చింది. నేను నాలుగు రోజులు లేవలేదు. ఆయన హోటల్లో భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళి వొస్తూ వుండేవారు. కొన్నాళ్లల్లో ఆయనకి వేరే పెద్ద ఉద్యోగం అయింది. మా జీవితం బాగుపడింది అనుకున్నాము. తక్కిన వాళ్లలాగే, కళ్లు మూసుకుని, సుఖంగా బతకొచ్చు ననుకున్నాం.

"కాని, ఆ ఆఫీసరు బదిలీ కావడం, కొత్త ఉద్యోగి ఈయన్ని కిందకిదించడం ఒకసారే జరిగాయి. అప్పుడు మాకు కలిగిన విచారానికి మేరలేదు. కాని కొత్త ఉద్యోగికూడా అదే మోస్తరవడంవల్ల నీచానికి మళ్ళీ వొడబడ్డాం.

"ఈసారి ఆయనకి టూరింగ్ ఉద్యోగం దొరికింది. పద పదిహేను రోజులు ఊళ్లో ఉండేవారు కారు. ఒకసారి వరసగా రెండు నెల్లుండిపోయారు. అప్పుడు నేను వొంటరి తనాన్ని భరించలేకపోయాను. అప్పటికే ముగ్గురు మనషులు మారిన నాకు సిగ్గనేది పోయింది. మా యింటిప్రక్కన వున్న బ్రహ్మచారి నాకర్షించి ఆ రెండు నెల్లూ గడిపాను.

"తర్వాత భర్తవున్నా అంతే. మా యింటికి వొచ్చిన అతిథులు నా ఆతిథ్యం స్వీకరించని వారెవరూ లేరు—మీరు తప్ప. మొదట ఆయన చచ్చేలా పోరారు. కాని, అప్పట్లో నన్ను ఎవరూ ఆపలేకపోదురు. అంతకీ కావాలంటె ఆయనినుంచి విడిపోడానికి కూడా సిద్ధమయ్యాను. అందుకనే ఆయన పెదవి కదపలేదు.

"ఒకసారి ఎవరో మిత్రుడు వొస్తే ఆయన వొద్దన్నా-రచ్చకిప్పొవద్దన్నా-సినిమాలకీ, వాటికీ తిరిగాను; ఆయనతో హోటల్లో కొన్ని రోజులు గడిపాను. వారం అయ్యాక ఇంటికి వొస్తే ఆయన లేరు. ఆయన జాడ ఇప్పటికీ తెలీలేదు.

"ఉన్న నగలూ, సామానులూ అమ్మి ఇన్నాళ్లు బతికాను. నాలుగు రోజుల్నించి ఓ టాంగావాడు......" చిరునవ్వు నవ్వి పమిట తీసింది. వక్షం నిండా కొరుకులు, రక్కులు......మళ్ళీ వెంటనే కప్పుకుంది.

"చలంగారి మైదానం చదివావా?"

"లేదు; ఏం?"

"ఏం లేదు. అది మైదానం—కాని ఇది పట్నవాసం! మైదానం కాదు........."

అంది వొగురుస్తూ వెనక్కి తిరిగి పడుకుంది.

పెద్ద దగ్గు తెర వొచ్చి ఐదు నిమిషాలు ముంచేత్తింది. కళ్లతో నన్ను చూస్తూ, వెడతానన్నట్టు సంజ్ఞ చేసింది. తర్వాత జోడించిన చేతులు అల్లాగే వున్నాయి. కళ్ళు మయ్యబడలేదు.

"ఎలాగా బ్రతకదు. కాని ఇప్పుడు మన శాంతి లభించి, సుఖంగా పోయుంటాయి జీవాలు" అన్నారు డాక్టరు మూర్తి గుడ్డని ముఖంమీద కప్పుతూ.

నేను లేచి చేతులు జోడించాను ప్రతి నమస్కారం చేస్తూ; కళ్లనుండి రెండు నీటి చుక్కలు నేలమీద పడ్డాయి.

"నా కథ విన్నాక నన్ను నిందించరు, మీరు నా భర్తనీ నిందించరు. మనం నివసించే దుర్భర సమాజ పరిస్థితుల్నీ, పరిస్థితుల్ని మార్చుకోవడం తెలియని మన చాతకానితనాన్ని నిందించుకోవాలంతే..."

ఆవిడ చెప్పిన మాటలు చెవిలో ప్రతిధ్వనించసాగాయి.

★

